అమెరికాకు చైనా ఝలక్‌లు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు బూమరాంగ్ అవుతున్నట్టు కనిపిస్తున్నాయి. చైనాకు చెక్ పెట్టాలని ఎడాపెడా పెంచుతూపోయిన టారిఫ్‌లు.. ఇప్పుడు ట్రంప్ సర్కారునే ఒత్తిడిలో పడేస్తున్నాయి మరి. ట్రంప్ సుంకాలకు బీటుగా స్పందిస్తున్న జిన్‌పిన్ ప్రభుత్వం.. అన్ని రకాలుగా అమెరికాను ఇరుకున పెట్టాలని చూస్తున్నది. ఈ క్రమంలోనే తాజాగా బోయింగ్ జెట్ డెలివరీలు ఆగిపోయాయి.

- బోయింగ్ విమానాల డెలివరీలను ఆపేసిన డ్రాగన్
- ముదిరిన వాణిజ్య యుద్ధమే కారణం
- ఇప్పటికే అరుదైన ఖనిజాల ఎగుమతులకు బ్రేక్
- ట్రంప్ సర్కారుపై ఒత్తిడి.. చర్చల దిశగా అడుగులు

బీజింగ్/వాషింగ్టన్, ఏప్రిల్ 15: అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ తల పట్టుకుంటున్నారు. చైనాతో వాణిజ్య యుద్ధం కొరివితో తల గోక్కున్నట్టవుతున్నది మరి. నువ్వా-నేనా అన్నరీతిలో సాగుతున్న ఈ టారిఫ్ వార్‌లో.. చివరకు డ్రాగన్‌దే పైచేయిగా నిలిచే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తుండటం గమనార్హం. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో చైనాపై అమెరికా ఎంతలా? ఆధారపడుతున్నదో కూడా ఈ సందర్భంగా అందరికీ తెలిసొస్తున్నది. అమెరికా మార్కెట్ చైనాకు ఎంత అవసరమో.. అక్కడి కంపెనీలకు చైనాలోని వ్యాపారావకాశాలు, వనరులు కూడా అంతే అవసరం. సరిగ్గా దీనిపైనే దృష్టి సారించిన జిన్‌పిన్ సర్కారు.. ఆ కోణంలోనే పావులు కదుపుతున్నది. ఇందులోభాగంగానే తాజాగా బోయింగ్ విమానాల డెలివరీలను చైనా ఆపేసింది. అమెరికాకు చెందిన బోయింగ్ కంపెనీకి దూరంగా ఉండాలని తమ దేశ ఎయిర్‌లైన్స్ సంస్థలకు చైనా స్పష్టం చేసింది. అమెరికా సంస్థల నుంచి ఎయిర్‌క్రాఫ్ట్ సంబంధిత విడిభాగాలను, ఇతరత్రా పరికరాలను కొనవద్దని కూడా హుకుం జారీ చేసినట్టు బ్లూంబర్గ్ చెప్తున్నది.

పెద్ద మార్కెట్

ప్రస్తుతం అమెరికాలోకి దిగుమతయ్యే చైనా వస్తూత్పత్తులపై 145 శాతం ప్రతీకార సుంకాలు అమలవుతుండగా.. చైనాలోకి దిగుమతయ్యే అమెరికా వస్తూత్పత్తులపై 125 శాతం టారిఫ్‌లు పడుతున్నాయి. ఈ క్రమంలోనే బోయింగ్ జెట్స్‌ను లీజుకు తీసుకుని నడిపిస్తున్న స్వదేశీ విమానయాన సంస్థలకు అధిక టారిఫ్‌లతో పెరుగుతున్న ఖర్చుల నుంచి ఉపశమనం లభించేలా చర్యలనూ చైనా చేపడుతున్నది. కానీ ఈ నిర్ణయం తమ విమాన అమ్మకాల్లో అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న చైనాను బోయింగ్ కోల్పోయేలా చేస్తున్నది. ఇక ఇప్పటికే ఎలక్ట్రానిక్, రక్షణ, టెక్నాలజీ రంగాల్లో వాడే కీలక ఖనిజాల ఉత్పత్తిని చైనా ఆపేసింది. దీంతో టెస్లా, యాపిల్ మరికొన్ని సంస్థల ఉత్పత్తికి ఇది పెద్ద దెబ్బలా తయారవుతున్నది. ఇతర దేశాలపైనా ఈ ప్రభావం కనిపించేలా ఉండగా.. ట్రంప్ ప్రభుత్వానికి ఇంటా, బయట ఇబ్బందులు తెచ్చిపెట్టేలా ఉన్నది.

మరోవైపు ట్రంప్ సుంకాలపై గుర్రుగా ఉన్న దేశాలను ఒక్క తాటిపైకి తెచ్చేందుకూ చైనా కృషి చేస్తున్నది. దీంతో అమెరికాపై ఒత్తిడి రాబోయే రోజుల్లో ఇంకా పెరిగే అవకాశాలే కనిపిస్తున్నాయి.

ఫార్మా, చిప్‌లకూ ముప్పే

ఫార్మా, సెమీకండక్టర్ దిగుమతులకు ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపునిచ్చిన ట్రంప్.. వీటిపైనా వీలున్నంత త్వరలో అదనపు టారిఫ్‌లు వేయాలని చూస్తున్నారు. విదేశాల నుంచి వచ్చే ఔషధాలు, చిప్‌లతో అమెరికా జాతీయ భద్రతకు వాటిల్లే ముప్పుపై ట్రంప్ సర్కారు దర్యాప్తు చేస్తున్నది. ఈ క్రమంలో వాణిజ్య విస్తరణ చట్టం 1962లోని సెక్షన్ 232 కింద ఫార్మా, చిప్ ఉత్పత్తులపై సుంకాల పెంపు ఉండవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజా పరిస్థితుల నడుమ అరబిందో, సన్ ఫార్మా, రెడ్డీస్, గ్లాండ్ ఫార్మా, లుపిన్ తదితర కంపెనీల షేర్లు మంగళవారం సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కొన్నాయి.

- వచ్చే 20 ఏండ్లలో అంతర్జాతీయంగా పెరిగే ఎయిర్‌క్రాఫ్ట్‌ల డిమాండ్‌లో చైనా వాటానే 20 శాతంగా ఉంటుందని అంచనా.
- 2018లో చైనాకు దాదాపు 25 శాతం విమానాలను డెలివరీ చేసిన బోయింగ్.
- బైడెన్, ట్రంప్ నిర్ణయాలతో విసిగిపోతున్న చైనా.. యూరోపియన్ కంపెనీ ఎయిర్‌బస్‌కే ఎక్కువ విమానాల ఆర్డర్లను ఇస్తున్నది.
- బోయింగ్ విమానాల్లో వరుస సమస్యలు తలెత్తుతుండటం కూడా చైనాను ఆ కంపెనీకి దూరం చేస్తున్నది.
- త్వరలో ఫార్మా, సెమీకండక్టర్ దిగుమతులపైనా ప్రతీకార సుంకాలు.
- గత ఏడాది అమెరికాలోకి 213 బిలియన్ డాలర్ల విలువైన ఔషధ దిగుమతులు. మొత్తం గత పదేండ్లలో జరిగిన దిగుమతుల విలువ కంటే రెండున్నర రెట్లు ఎక్కువ.
- అమెరికా టారిఫ్ హెచ్చరికలతో ఆందోళనలో భారతీయ ఔషధ రంగ సంస్థలు.
- వారం రోజుల్లో 6-10 శాతం మేర పడిపోయిన అరబిందో, గ్లాండ్ ఫార్మా షేర్లు. జనవరి నుంచి 20-23 శాతం నష్టాలు.
- వారంలో గ్లెన్‌మార్క్ ఫార్మా షేర్ విలువ 10 శాతం డౌన్. సన్ ఫార్మా 3 శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.23 శాతం, జైడస్ 2 శాతం కుదేలు.
- 4 శాతానికిపైగా కోల్పోయిన లుపిన్. స్వల్ప నష్టాల్లోనే సిప్లా షేర్లు.

తులం రూ.1.25 లక్షలకు?

- ఈ ఏడాది ఆఖర్లో చేరుకోవచ్చు
- బంగారం ధరలపై గోల్డ్‌మన్ సాచ్స్ అంచనా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15: దేశీయ మార్కెట్‌లో ఈ ఏడాది ఆఖరుకల్లా 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల బంగారం ధర రూ.1.25 లక్షలకు చేరవచ్చని అమెరికాకు చెందిన ప్రముఖ బహుళ జాతి ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్, ఆర్థిక సేవల దిగ్గజ సంస్థ గోల్డ్‌మన్ సాచ్స్ మంగళవారం అంచనా వేసింది. ఇప్పటికే భారతీయ విపణిలో గోల్డ్ రేట్లు లక్షకు చేరువైన నేపథ్యంలో ఈ అంచనా అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. కాగా, అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ డిసెంబర్ నాటికి ఔన్స్ 4,500 డాలర్లు పలుకవచ్చని గోల్డ్‌మన్ సాచ్స్ చెప్తున్నది. ఈ క్రమంలోనే ఇదే గనుక జరిగితే దేశీయంగా తులం రూ.1.25 లక్షలకు చేరడం ఖాయమని అంటున్నది.

వాణిజ్య యుద్ధం ముదిరితే

వాణిజ్య యుద్ధం ముదిరితే బంగారం ధరలు ఆకాశమే హద్దుగా దూసుకుపోవచ్చన్న అభిప్రాయాలు ఎప్పట్నుంచో వినిపిస్తున్నాయి. గోల్డ్‌మన్ సాచ్స్ కూడా ఇప్పుడిదే చెప్తున్నది. ట్రంప్ ప్రతీకార సుంకాలకు తెరతీయడంతో భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు అంతకంతకూ పతనమైపోయాయి. దీంతో మదుపరులు తమ పెట్టుబడుల రక్షణార్థం పసిడి వైపునకు కదులుతున్నారు. ఫలితంగా మార్కెట్‌లో ధరలు పరుగులు పెడుతున్నాయి. అయితే టారిఫ్‌ల నుంచి చైనా మినహా అన్ని దేశాలకు 90 రోజులపాటు విముక్తి లభించడంతో ఈక్విటీ మార్కెట్లు మళ్లీ కోలుకుంటున్నాయి. కానీ చైనాతో అమెరికా సుంకాల పోరు కొనసాగుతుండటం.. ఇన్వెస్టర్లలో ఆందోళనల్ని తగ్గించలేకపోతున్నది. ఈ నేపథ్యంలోనే పుత్తడి ధరలపై ఈ ఏడాదిలో ఇప్పటిదాకా గోల్డ్‌మన్ సాచ్స్ తమ అంచనాలను మూడుసార్లు సవరించింది. తొలుత ఔన్స్ 3,300 డాలర్లుగా, ఆ తర్వాత 3,700 డాలర్లుగా, ఇప్పుడు 4,500 డాలర్లు అన్నది. ఇక ఆర్థిక మాంద్యం భయాల నడుమ ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్ బ్యాంకులు పసిడి నిల్వలను పెంచుతూపోతుండటం కూడా పుత్తడి ధరల్ని అమాంతం పెంచేస్తున్నది. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా గ్లోబల్ మార్కెట్‌లో ఔన్స్ గోల్డ్ విలువ 23 శాతం పుంజుకోగా, దేశీయంగా తులం రూ.20 వేలదాకా ఎగిసింది. మంగళవారం తులం 24 క్యారెట్ రూ.96,450ని తాకి మళ్లీ రేట్లు ఆల్‌టైమ్ హైని చేరడం.. గోల్డ్ మార్కెట్ రక్షకు నిదర్శనంగా నిలుస్తున్నది.

హైదరాబాద్‌లో కాగ్నిజెంట్ జీసీసీ

సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూపుతో కలిసి ఏర్పాటు

హైదరాబాద్, ఏప్రిల్ 15: గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లు(జీసీసీ) ఆకట్టుకోవడంలో హైదరాబాద్ దూసుకుపోతున్నది. ఇప్పటికే ఇక్కడ అంతర్జాతీయ సంస్థలు జీసీసీలను నెలకొల్పగా..తాజాగా ఐటీ దిగ్గజం కాగ్నిజెంట్ కూడా ఈ జాబితాలోకి చేరింది. అమెరికాకు చెందిన ఆర్థిక సేవల సంస్థ సిటిజెన్స్ ఫైనాన్షియల్ సంస్థతో కలిసి ఏర్పాట చేసిన జీసీసీని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...గ్లోబల్ బిజినెస్ హబ్‌గా మారిన హైదరాబాద్‌లో 2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-ఏ కమర్షియల్ ఆఫీస్ స్థలాలను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో ఆఫీస్ స్థలాలకు గిరాకీ భారీగా పెరుగుతున్నదని, గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్థలాన్ని పలు రిటైల్ సంస్థలు అద్దెకు తీసుకున్నట్టు చెప్పారు. ప్రస్తుతం నగరంలో అమెజాన్, గ్లోబల్ లాజిక్‌తోపాటు పలు అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ 355 జీసీసీలను ఏర్పాటు చేయగా, తద్వారా 3 లక్షల మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. గడిచిన ఏడాది వ్యవధిలోనే 70కి పైగా జీసీసీ ప్రారంభంకావడం విశేషమన్నారు. ఇక్కడ తమ జీసీసీని ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం వెయ్యి మంది ఐటీ, డాటా నిపుణులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని...వచ్చే రెండు, మూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు.

సుంకాల సడలింపుతో జోష్

సెన్సెక్స్ 1,578, నిఫ్టీ 500 పాయింట్ల లాభం

ముంబై, ఏప్రిల్ 15: దేశీయ స్టాక్ మార్కెట్లు కదంతొక్కాయి. ప్రతీకార సుంకాల నుంచి ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులకు మినహాయింపునిస్తున్నట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడంతోపాటు ఆటోమొబైల్స్‌పై సుంకాలను తగ్గించే యోచనలో ఉన్నట్టు వచ్చిన వార్తల వల్ల అంతర్జాతీయంగా మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. ఇదే క్రమంలో దేశీయ సూచీలు పుంజుకున్నాయి. సెన్సెక్స్ 1,577.63 పాయింట్లు లేదా 2.10 శాతం లాభపడి 76,734.89 వద్ద ముగియగా.. నిఫ్టీ సైతం 500 పాయింట్లు (2.19 శాతం) అందుకొని 23 వేల మార్క్‌ను అధిగమించి 23,328.55 వద్ద ముగిసింది. సూచీలు వరుస లాభాలతో దూసుకుపోతుండటంతో మదుపరులు భారీగా సంపదను పోగేసుకున్నారు. రెండు రోజుల్లో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.18,42,028.91 కోట్లు ఎగబాకి రూ.4,12,24,362.13 కోట్లు(4.81 ట్రిలియన్ డాలర్లు) చేరుకున్నట్టు అయింది.

సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ ప్రారంభం నేడు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): అనేక అడ్డంకులు, అవాంతరాలు, అనుమతుల్లో జాప్యం. ఇలా మొత్తంగా 9 ఏండ్ల సింగరేణి సుదీర్ఘ నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడనుంది. రాష్ట్రం బయట సంస్థ చేపట్టిన తొలి బొగ్గు గని 'నైనీ'లో ఉత్పత్తిని ప్రారంభించబోతున్నది. ఈ బొగ్గు బ్లాక్‌ను రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బుధవారం వర్చ్యువల్‌గా ప్రారంభించనున్నట్టు సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ తెలిపారు. ఇంతకాలం రాష్ట్రం వరకే పరిమితమైన సింగరేణి.. దీంతో ఇతర రాష్ట్రాల్లోకి అడుగుపెట్టడం ఒక చారిత్రాత్మక ఘట్టంగా ఆయన పేర్కొన్నారు. 2016లో కేంద్ర బొగ్గు శాఖ సింగరేణికి ఈ గనిని కేటాయించిందని, అనుమతులు సాధించి, బొగ్గు తవ్వకం ప్రారంభించేందుకు తొమ్మిదేండ్లు పట్టిందన్నారు. ఈ గనిలో 340.78 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలను వెలికితీసేందుకు అవకాశముంది. పూర్తిస్థాయికి చేరుకుంటే కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి కానున్నది. సింగరేణిలో 17 ఓపెన్‌కాస్ట్ గనుల కన్నా ఇదే పెద్దది.

పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు!

నేడు వీసీలతో సమావేశం కానున్న టీజీపీఎస్సీ

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : పోటీ పరీక్షలు సహా గ్రూప్స్ సిలబస్ మారనున్నదా? కొన్ని అంశాలను తొలగించనున్నారా? అంటే అవుననే సంకేతాలు వెలువడుతున్నాయి. సిలబస్ సహా ఇతర సంస్కరణలపై టీ జీపీఎస్సీ బుధవారం ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నది. అన్ని యూనివర్సిటీల వీసీలు, ఉన్నత విద్యామండలి అధికారులతో భేటీ కానున్నది. ఈ భేటీలో వర్సిటీల్లో అమలవుతున్న సిలబస్, టీజీపీఎస్సీ సిలబస్ అంశాలపై చర్చించనున్నట్టు తెలిసింది. 2015 తర్వాత సిలబస్ మార్పునకు కసరత్తు చేయడం ఇదే తొలిసారి.

గోదావరి జలాల మళ్లింపునకు ఏపీ కుట్రలు

- జీబీ లింక్‌తో భారీగా నీటి తరలింపు
- గోదావరి-పెన్నా డైవర్షన్‌కే.. వైఎస్ఆర్ పల్నాడు స్కీమ్‌గా పేరు మార్పు
- బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ముందు తెలంగాణ వాదనలు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): గోదావరి జలాల మళ్లింపునకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 ముందు తెలంగాణ అధికారులు వాదనలు వినిపించారు. రాష్ట్ర విభజన అనంతరం గోదావరి నుంచి పెన్నా బేసిన్‌కు భారీ స్థాయిలో నీటిని తరలించుకుపోయేందుకు ఏపీ ప్రభుత్వం భారీ ప్రాజెక్టులను చేపట్టిందని తెలిపారు. జీబీ లింక్ పేరిట భారీగా నీటిని బేసిన్‌కు అవతల ఉన్న పెన్నాకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నదని వాదించారు. తొలుత గోదావరి-పెన్నా డైవర్షన్ స్కీమ్ పేరుతో ప్రాజెక్టును ఏపీ చేపట్టిందని, ఆ తర్వాత దానిని వైఎస్ఆర్ పల్నాడు స్కీమ్‌గా మార్చిందని చెప్పారు. ఇప్పుడు పోలవరం నుంచి నీటిని తీసుకెళ్లేలా దానిని గోదావరి-బనకచర్ల (జీబీ) లింక్‌గా మార్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న పోలవరం కుడి కాల్వ నుంచే రోజూ 1.5 టీఎంసీల నీటిని తరలించేలా ఆ కాల్వ సామర్థ్యాన్ని పెంచిందని, కానీ, గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్‌కు సమర్పించిన డీపీఆర్ ప్రకారం ఆ కాల్వ సామర్థ్యం కేవలం 10 వేల క్యూసెక్కులేనని వివరించారు. ప్రస్తుతం పెంచిన సామర్థ్యంతో పోలవరం నుంచి 90 రోజులపాటు 135 టీఎంసీల నీటిని బనకచర్లకు తరలించేలా జీబీ లింక్ ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ముందుకు తీసుకెళ్తున్నదని పేర్కొన్నారు.

పోలవరం నుంచి నీటి తరలింపు

పోలవరం ప్రాజెక్టు ద్వారా ఏపీ భారీ మొత్తంలో నీటిని తరలించుకుపోయే ప్రాజెక్టులను చేపట్టిందని తెలంగాణకు చెందిన అడ్వొకేట్లు ట్రిబ్యునల్ ముందు వాదించారు. పోలవరం నుంచి 80 టీఎంసీలు తీసుకునేలా పట్టిసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను డిజైన్ చేశారని, ఆ నీళ్లతో పాటు ఇతర సోర్సుల ద్వారా తరలించే నీళ్లు కేడీఎస్ అవసరాలకు సరిపోతాయని వాదించారు. ఈ సమయంలో జోక్యం చేసుకున్న ట్రిబ్యునల్.. 215 టీఎంసీల కన్నా ఎక్కువ నీటి అవసరాలున్నాయని ట్రిబ్యునల్ ముందు చూపించారని, కానీ, ట్రిబ్యునళ్లు కేవలం 151.2 టీఎంసీలే కేటాయించాయి కదా అని ప్రశ్నించింది. దానికి స్పందించిన తెలంగాణ అడ్వొకేట్.. ఆ అవసరాల కోసమే 80 టీఎంసీలను పట్టిసీమ ద్వారా తరలించేలా లిఫ్టును నిర్మించారని వివరించారు. కేడీఎస్ అవసరాలు కేవలం 151.2 టీఎంసీలేనని, అందుకు అనుగుణంగా సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), టెక్నికల్ అడ్వైజరీ కమిటీలకు ఏపీ డీపీఆర్‌లనూ సమర్పించిందని గుర్తుచేశారు. పట్టిసీమ ద్వారా 80 టీఎంసీలను డైవర్ట్ చేయగా.. కేడీఎస్ నీటి అవసరాలు కేవలం 72 టీఎంసీలేనని స్పష్టం చేశారు. కాగా, శ్రీశైలంలో జల విద్యుత్తు ఉత్పత్తిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలంటూ ఏపీ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ ఉండటంతో.. మధ్యాహ్నం వరకే వాదనలు కొనసాగాయి. అయితే, సుప్రీంకోర్టుకు వెళ్లాక ఆ కేసును బెంచ్ మే 7వ తేదీకి వాయిదా వేసింది. బుధవారం, గురువారం రెండు రోజులపాటు ట్రిబ్యునల్‌లో వాదనలు కొనసాగనున్నాయి. రాష్ట్రం తరపున సీనియర్ అడ్వొకేట్ సీఎస్ వైద్యనాథన్ వాదనలు వినిపించారు. అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డితో పాటు ఇరిగేషన్ శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇంటర్ స్టేట్ వాటర్ రిసోర్సెస్ ఎస్ఈ విజయ్‌కుమార్ తదితరులు వాదనలకు హాజరయ్యారు.

పోలీసింగ్‌లో తెలంగాణ మళ్లీ నం.1

- లీగల్ ఎయిడ్, జైళ్లశాఖల్లో తగ్గిన పనితీరు
- 3 విభాగాల్లో దారుణంగా పడిపోయిన ర్యాంకులు
- జ్యుడీషియరీలో పెరిగిన పనితీరు

హైదరాబాద్, ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీస్‌ను దేశంలోనే అత్యున్నతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనతో హోంశాఖకు వెన్నుదన్నుగా నిలిచిన కేసీఆర్ సంకల్పం వృథాగా పోలేదు. ఇండియా జస్టిస్ రిపోర్టు-2025లో తెలంగాణ పోలీసులు ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచారు. 6.48/10 పాయింట్లతో తెలంగాణ తొలి స్థానం దక్కించుకుంది. కేసీఆర్ వేసిన బాటల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నడవడం, పోలీసుశాఖకు నిధులు మంజూరు చేయడంతో అక్కడక్కడ మినహా.. పోలీసుల పనితీరు మెరుగుపడటంతో మళ్లీ తొలిస్థానంలో కొనసాగింది. ఇండియా జస్టిస్ 2022లో విడుదల చేసిన రిపోర్టులోనూ తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఐదేండ్లలో వరుసగా రెండు సార్లు తొలిస్థానంలో నిలిచిన రాష్ట్రంగా తెలంగాణ కీర్తి గడించింది. తెలంగాణ తర్వాత ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలు వరుసగా నిలిచాయి. చివరిస్థానంలో వెస్ట్‌బెంగాల్ ఉంది. 2020-21లో బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యధికంగా పోలీసుల ట్రైనింగ్ కోసం బడ్జెట్‌లో 193.5 కోట్లు కేటాయించిందని రిపోర్టు గుర్తుచేసింది. అలాగే 2021-22లో 68 కోట్లను కేటాయించింది.

జైళ్లశాఖలో తగ్గిన పనితీరు..

ఇండియా జస్టిస్ రిపోర్టు ప్రకారం.. జైళ్ల సంక్షేమంలో తెలంగాణ 7వ స్థానానికి పడిపోయింది. కాంగ్రెస్ హయాంలో జైళ్లశాఖ పనితీరు దారుణంగా తగ్గింది. 2020 రిపోర్టులో తెలంగాణ 2వ స్థానంలో.. 2022లో 3వ స్థానంలో కొనసాగగా.. ఏడాదిన్నరకే 7వ స్థానానికి పడిపోయింది. జైళ్లశాఖ సంక్షేమం, పనితీరులో మొదటిస్థానంలో తమిళనాడు ఉండగా.. ఐదో స్థానంలో మధ్యప్రదేశ్ నిలిచింది. ఇక ఉత్తరాఖండ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్‌లు అధ్వాన పనితీరుతో చివరి మూడు స్థానాల్లో నిలిచాయి.

లీగల్ ఎయిడ్ సర్వీసెస్‌లో 10వ స్థానం..

ఇండియా జస్టిస్ రిపోర్ట్ ప్రకారం.. లీగల్ ఎయిడ్ సర్వీసెస్‌లో తెలంగాణ ర్యాంకింగ్ దారుణంగా పడిపోయింది. 2019లో 4వ స్థానంలో, 2020లో 6వ స్థానంలో, 2022లో 5వ స్థానంలో ఉండగా.. 2025లో 10వ స్థానానికి దిగజారింది. లీగల్ ఎయిడ్ సర్వీసెస్‌లో కర్ణాటక, పంజాబ్, హర్యాన, ఉత్తరాఖండ్, ఆంధ్రప్రదేశ్‌లో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఇక స్టేట్ హ్యూమన్ రైట్స్ కమిషన్స్ విభాగంలో.. తెలంగాణ 17వ స్థానానికి పరిమితమైంది. కాగా, జ్యుడీషియరీలో రెండో స్థానంలో నిలిచింది.

జూనియర్ కాలేజీలకు మంగళం?

మొదటిపేజీ తరువాయి...

చూడాలని సర్కారుకు సూచించింది.

సక్సెస్‌కు చిరునామా ఇంటర్ విద్య..

1969-70లో పీవీ నర్సింహారావు విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. అప్పటి నుంచి విజయవంతంగా నడుస్తున్నది. ఒక రకంగా చెప్పాలంటే ఇంటర్ విద్య సక్సెస్‌కు కేరాఫ్ అడ్రస్ అయ్యింది. నేడు ఐఐటీలు, ఎన్ఐటీల్లో 15-20 శాతం మన విద్యార్థులున్నారంటే అందుకు ఇంటర్ విద్యావ్యవస్థే కారణం. మెడికల్ సీట్లను అత్యధికులు పొందుతుండడం కూడా ఇంటర్ విద్యతోనే. ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులు ఎంతో ప్రయోజకులవుతున్నారు.

అధ్యాపక సంఘాల ఆగ్రహం..

రాష్ట్రంలో ప్రస్తుతం 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో దాదాపు 1.6 లక్షల మంది విద్యార్థులున్నారు. ఇవన్నీ దాదాపు మండల కేంద్రాల్లోనే ఉన్నాయి. వీటిల్లో విద్యార్థులకు ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నారు. విద్యార్థుల నుంచి కేవలం పరీక్ష ఫీజు మాత్రమే తీసుకుంటున్న కాలేజీలను ఎత్తివేయాలని విద్యాకమిషన్ సిఫారసు చేయడం గమనార్హం. విద్యాకమిషన్ సిఫారసులను ఇంటర్ అధ్యాపక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. కమిషన్ సిఫారసులను సర్కారు అమలుచేస్తే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నాయి. లక్షల ఫీజుతో దోపిడీ చేస్తున్న కార్పొరేట్ కాలేజీలను అదుపుచేయడంపై విద్యాకమిషన్ ఎందుకు దృష్టిసారించడం లేదని ప్రశ్నిస్తున్నాయి.

తలెత్తనున్న సమస్యలు..

- ఇంటర్ అకడమిక్ క్యాలెండర్, పాఠశాల విద్య అకడమిక్ క్యాలెండర్ వేర్వేరుగా ఉంటాయి. సమన్వయం ఎలా చేస్తారు?
- ఒక పబ్లిక్ స్కూల్‌లో 1,500 మంది విద్యార్థులు ఉండాలని కమిషన్ సూచించింది. ఇంతమంది ఒకేసారి మధ్యాహ్న భోజనం చేయగలరా? ఇంత మంది ఒకేసారి వాడుకునే స్థాయిలో టాయిలెట్లు ఉంటాయా?
- దాదాపు అన్ని సర్కారు జూనియర్ కాలేజీలకు సొంత భవనాలు, స్థలాలు ఉన్నాయి. వాటిని ఏంచేస్తారు?
- పబ్లిక్ స్కూళ్లను మండలాల్లోనే ఏర్పాటుచేయనుండటంతో కొన్ని కాలేజీలను విలీనం చేసి మరికొన్నింటిని చేయకపోతే సమస్యలు తలెత్తవా?
- కాలేజీలు, స్కూళ్లకు వేర్వేరు పర్యవేక్షణాధికారులుగా డీఐఈవో, డీఈవో ఉంటారు. ఒకే క్యాంపస్‌లో ఉన్న వాటిని ఎవరు తనిఖీ చేయాలి?

60 ఏండ్లు వెనక్కి తీసుకెళ్లడమే

ప్రభుత్వ జూనియర్ కాలేజీను తెలంగాణ పబ్లిక్ స్కూళ్లలో విలీనం చేయాలనడం ఆత్మహత్యా సదృశ్యం. ఇలాంటి ప్రతిపాదనలతో విద్యావ్యవస్థను 60 ఏండ్లు వెనక్కి తీసుకెళ్లడమే అవుతుంది. ఇంటర్ విద్యతోనే మన పిల్లలు జేఈఈ, నీట్‌లో రాణిస్తున్నారు. ఎంబీబీఎస్, ఐఐటీ సీట్లు పొందుతున్నారు. ఈ కాలేజీలను బలోపేతం చేసేలా విద్యాకమిషన్ సిఫారసులు ఉంటాయనుకున్నాం. ప్రైవేట్ కాలేజీల ఆగడాలను అరికడతాయనుకున్నాం. కానీ, సర్కారు కాలేజీలకు ఉరి బిగించేలా ఉండటం ఆందోళనకరం.

– డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్

సిఫారసులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

ఇంటర్ విద్యను నాశనం చేసేలా విద్యా కమిషన్ సిఫారసులున్నాయి. ఈ సిఫారసులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. కొత్త సర్కారు కాలేజీల కోసం అనేక ప్రాంతాల నుంచి డిమాండ్లు వస్తున్నాయి. ఇటీవల పెద్దఎత్తున కొత్త కాలేజీలు ఏర్పాటుచేశారు. సర్కారు జూనియర్, గురుకుల కాలేజీలు కలిపితే ప్రైవేట్ కంటే ఎక్కువగా ఉన్నాయి. ఇవి విజయవంతంగా నడుస్తున్నాయి. ఇలాంటి కాలేజీలను పబ్లిక్ స్కూళ్లలో విలీనం చేయాలనుకోవడం దారుణం.

– జంగయ్య, ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

15 రోజుల్లోగా నివేదికివ్వాలి

సీతారామ సూపర్ ప్యాసేజ్ పిల్లర్ కూలిన ఘటనపై సీఈకి ఈఎన్‌సీ నోటీసులు

హైదరాబాద్, ఏప్